ప్రజాశక్తి

గురువారం 13 ఏప్రిల్ 2023 | 5 | విజయనగరం



1న పైడితల్లమ్మ దేవర మహోత్సవం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి దేవర మహోత్సవం మే 1వ తేదీన నిర్వహించి, ఆ రోజున అమ్మవారిని వనం గుడి నుండి చదురుగుడికి తీసుకు వచ్చే కార్యక్రమం చేపడుతున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.ఎల్.సుధారాణి వెల్లడించారు. ఆలయ పూజారి బంటుపల్లి వెంకటరావు, ట్రస్టు బోర్డు సభ్యులతో కలిసి అమ్మవారి కళ్యాణ మంటపంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 1వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఆలయ సంప్రదాయాల ప్రకారం వనం గుడి నుండి అమ్మవారు బయలుదేరి హుకుంపేటలో గల ఆలయ పూజారి ఇంటికి చేరుకుంటారని, రాత్రి 10 గంటలకు అక్కడ నుంచి బయలుదేరి 2వ తేదీ ఉదయం 6.30 గంటలకు చదురు గుడికి చేరుకుంటారని తెలిపారు. ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకుఏర్పాట్లు చేస్తున్నట్టు వెల్లడించారు.ట్రస్టు బోర్డు సభ్యులు పతివాడ వెంకట రావు, ఎంకెబి శ్రీనివాస రావు, బలివాడ పార్వతి, అచ్చిరెడ్డి పాల్గొన్నారు.

పేదల భూముల్లో నుంచి వేసిన రోడ్డు



యథేచ్ఛగా చెరువుల కబ్జా

- ప్రభుత్వ భూములనూ వదలని భూ బకాసురులు
- చెరువులో బోటు షికారు ఏర్పాటు చేసిన రియల్టర్
- పేదల భూముల్లో నుంచి రహదారి ఏర్పాటు
- అక్రమాలపై చర్యకు స్పందనలో సర్పంచ్ ఫిర్యాదు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

భూ బకాసురులు ప్రభుత్వ భూములతో పాటు చెరువులనూ కబ్జా చేసేస్తున్నారు. ఏకంగా ప్రభుత్వం పేదలకు కేటాయించిన భూములను సైతం కబ్జా చేసి దర్జాగా అందులో నుంచి రోడ్లను కూడా వేసేసి వాడుకుంటున్నారు. మరో అడుగు ముందుకేసి ఒకే ప్రాంతంలో ఉన్న నాలుగు చెరువులను కబ్జా చేసి అందులో ఒక చెరువును వారి లేఅవుట్‌కు వచ్చిన సందర్శకుల ఆహ్లాద నిమిత్తం బోటు షికారుగా వాడుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారంటే వారికి ఏ స్థాయిలో పెద్దల ప్రోత్సాహం ఉందో ఇట్టే అర్థమైపోతుంది.

మండలంలోని ముషిడిపల్లి రెవెన్యూ పరిధిలో ఏర్పాటు చేసిన ఎస్‌విఎన్ లేఅవుట్ (స్వప్నలోక్) లో ప్రభుత్వ డి-పట్టా భూములు, చెరువుల అక్రమాల లెక్క తేల్చాలంటూ ఆ గ్రామ సర్పంచ్ సోలిబొంగు దారప్ప జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇటీవల జరిగిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఆయన మంగళవారం ప్రజాశక్తితో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండా ఈ లే అవుట్ వేయడమే కాకుండా 516 నెంబర్ జాతీయ రహదారి నుండి వారి లేవుట్‌లోకి గ్రామానికి చెందిన చీమల గంగమ్మ, సుకురు అచ్చియమ్మ, వేమలి సీతమ్మలకు చెందిన 1.84ఎకరాల భూమిని ఆక్రమించుకుని 60 అడుగుల తారు రోడ్డు వేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గిరిజనుల భూములను ఆక్రమించి రోడ్లు నిర్మించడమే కాకుండా రోడ్డు నిర్మాణానికి ఎటువంటి పంచాయతీ అనుమతులు తీసుకోలేదని చెప్పారు. ముషిడిపల్లి పంచాయతీ పరిధిలోగల పది చెరువులలో నాలుగు చెరువులు ఈ లేఔట్‌లోనే ఉన్నాయన్నారు. ఈ చెరువులను కూడా ఆక్రమించి వ్యాపారం చేయాలని చూస్తున్నారని, జిల్లా అధికారులు వెంటనే స్పందించి ప్రభుత్వ చెరువులను పరిరక్షించాలని కోరామన్నారు. ఇందులో ఒక చెరువును బోటు షికారకు వినియోగిస్తున్నట్లు ఫ్లెక్సీలను కూడా ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ఈ విషయమే ఫీల్డ్ అసిస్టెంట్ సూర్యారావును వివరణ కోరగా ఈ లేఔట్‌లో ఉన్న నాలుగు చెరువులు గతంలో ఉపాధి హామీ పథకం ద్వారా అభివృద్ధి చేశామని స్పష్టం చేశారు. ఇప్పుడు ఆ చెరువుల జాడ కానరావడం లేదని తెలిపారు. ఇరిగేషన్ డిఇ శ్రీనివాసరావును వివరణ కోరగా ఈ లేఔట్‌లో రొంగలవాని చెరువు, దెటప్పోడి బంద, పిల్లవాని చెరువు, దొరవాని చెరువు అనే నాలుగు చెరువుల గట్లను తొలగించి చెరువులను ముక్కలు చేసి వాటి స్వరూపం మార్చేశారని, ప్రభుత్వ చెరువుల స్వరూపం మార్చే అధికారం వారికి లేదని ఈ విషయమై స్వయంగా చెరువులను పరిశీలించి జిల్లా ఇరిగేషన్ ఇఇకి వివరాలు పంపించామని అన్నారు. ఈ విషయమై తహశీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎటువంటి ప్రభుత్వ అనుమతులూ తీసుకోకుండా అసైన్డ్ భూముల్లో ప్రైవేట్ లేఔట్‌కు అప్రోచ్ రోడ్డు వేయడం నిబంధనలకు విరుద్ధమని, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు లేఅవుట్ యజమానులకు నోటీసులు జారీ చేశామని తెలిపారు.



ప్రభుత్వ చెరువులో బోటు షికారు ఏర్పాటు చేస్తూ బ్యానర్ పెట్టిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు

లేఅవుట్‌లో చెరువుల లెక్కలు తేల్చాలి

మండలంలోని ముసిడిపల్లి వద్ద గల లేఔట్ లో ఉన్న నాలుగు చెరువులను జిల్లా అధికారులు పరిశీలించి చెరువుల స్వరూపాన్ని మార్చిన వారిపై చర్యలు తీసుకోవాలి. చెరువులను పరిరక్షించాలి. లేని పక్షంలో చెరువుల పరిరక్షణకు ఉద్యమిస్తాం.

ఈశ్వర ప్రసాద్,
ఉత్తరాంధ్ర చెరువులు పరిరక్షణ కమిటీ ప్రతినిధి

కలెక్టర్ నాగలక్ష్మి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా కలెక్టర్ గా ఎస్.నాగలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీకాంత్, ఇతర అధికారులు స్వాగతం పలికారు. కలెక్టర్‌గా తన ఛాంబర్లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం నాగలక్ష్మికి, జిల్లా అధికారులు, రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు, ఎన్‌జీఓలు, వివిధ శాఖల సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

సమన్వయంతో ముందుకు వెళ్తాం

ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలను కలుపుకొని సమన్వయంతో పనిచేసి, జిల్లా అభివృద్ధికి కృషి చేస్తామని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ, జిల్లా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని అన్నారు. తమను నేరుగా కలిసి సమస్యలు ఏవైనా చెప్పుకోవచ్చని సూచించారు. జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి బాటలో నడిపేందుకు ప్రతీఒక్కరూ సహకారం అందించాలని కలెక్టర్ కోరారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి



చెక్కును అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

5,738 మందికి ఇబిసి నేస్తం

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలోని 5,738 మంది ఆర్థికంగా వెనుకబడిన, అగ్రవర్ణాలకు చెందిన 45 నుంచి 60 సంవత్సరాల వయసు గల మహిళలకు, రెండో విడత ఇబిసి నేస్తం విడుదల అయ్యింది. ఒక్కొక్కరికీ రూ.15వేలు చొప్పున మొత్తం రూ.860.70 లక్షల విలువైన చెక్కును లబ్దిదారులకు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అందజేశారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. ప్రకాశం జిల్లా మార్కాపురంలో రెండో విడత ఇబిసి నేస్తం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించిన అనంతరం, మహిళలకు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమాధికారి ఎం.యశోధనరావు, ఎపి స్టేట్ రెడ్డిక వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రౌతు భాస్కరరెడ్డి, రాష్ట్ర బిసి యాత వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గొంప అప్పలరాజు, ఎపి నాగవంశం వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అవనాపు లక్ష్మణరావు, బిసి కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్తత

మేడపై నుంచి దూకి చిరువ్యాపారి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని ఐస్ ఫ్యాక్టరీ కూడలిలో ఫుట్‌పాత్‌పై ఆక్రమణలు తొలగించేందుకు నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు బుధవారం చర్యలు చేపట్టారు. అయితే చిన్న చిరు దుకాణం నిర్వహిస్తున్న వ్యక్తి తన పొట్ట కొట్టొద్దని, కొద్దిరోజులు సమయం ఇస్తే తొలగిస్తానని అధికారులను వేడుకున్నాడు. అయినా పురపాలకశాఖ అధికారులు గడువు ఇవ్వడం కుదరదని చెప్పి జెసిబితో ఫుట్‌పాత్‌పై ఉన్న వాటిని తొలగించారు. దీంతో దుకాణ నిర్వాహకుడు రమణ మేడపైకి ఎక్కి విద్యుత్ వైర్లను పట్టుకునేందుకు ప్రయత్నించాడు. అప్పటికే అక్కడకు చేరుకున్న రెండవ పట్టణ సిఐ విద్యుత్ అధికారులతో మాట్లాడి విద్యుత్‌ను నిలిపి వేయించారు. దీంతో రమణ మేడపై నుంచి దూకేశాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని వెంటనే కేంద్రాసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ ఎసిపి మధుసూదనరావు మాట్లాడుతూ ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ లో కాలువలపై ఆక్రమణలు ఉన్నాయని, కాలువల్లో పూడికలతో నిండిపోయి ప్రజలకు ఇబ్బందిగా మారిందన్నారు. ఈనేపథ్యంలో తొలగింపునకు చర్యలు చేపట్టామని తెలిపారు.



మేడపై నుంచి దూకేసేందుకు సిద్ధమవుతున్న వ్యాపారి రమణ (వృత్తంలో)



ధర్నాలో మాట్లాడుతున్న అమరావతి జెసి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

సిపిఎంఎస్‌ను రద్దు చేయాలి

- ట్రెజరీ ద్వారా చెల్లింపులు చేయాలి
- ధర్నాలో అమరావతి జెసి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-విజయనగరం

ఉద్యోగులకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలను గతంలో మాదిరిగానే చెల్లింపులు చేయాలని, గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సిఎఫ్ఎంఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని అమరావతి జె ఎసి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. జెఏసి ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. ఉద్యోగుల డిమాండ్లపై గత నెల నుంచి దఫా దఫాలుగా నిరసన కార్యక్రమాలు చేస్తున్నామని, అయినా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందనా లేకపోవడంతో ఆందోళన ఉధృతం చేస్తున్నామని చెప్పారు. ఉద్యగులకు సంబంధించిన డిఎ, జిపిఎఫ్, పిఆర్‌సి తదితర వాటి ఎరియర్స్ వివరాల లెక్కలు చెప్పని ప్రభుత్వం మిగతా పనులు ఏవిధంగా చేస్తుందో అర్థం కావడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సంఘాలకు అతీతంగా ఉద్యోగులంతా ఉద్యమాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రాజు, తాడ్డి గోవింద్, యడ్ల గోవింద, శంకరరావు, సూర్య తదితరులు పాల్గొన్నారు.

1998 డిఎస్‌సి పోస్టుల భర్తీకి కౌన్సిలింగ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

1998 డిఎస్‌సి పోస్టుల భర్తీకి బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అభ్యర్థులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. క్వాలిఫై అయిన 504 మందికి గాను ఖాళీగా ఉన్న 489 పోస్టులకు కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేసే ప్రక్రియను జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా భర్తీకి నోచుకోని పోస్టులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు నెరవేర్చారని తెలిపారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి , రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చొరవతో ఈ అవకాశం కలిగిన మీరంతా సమాజంలో ఉన్నతమైన స్థానాన్ని సంపాదించుకున్నారని అన్నారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ డాక్టర్ ఎం.అశోక్ కుమార్, డిప్యూటీ సిఇఒ రాజ్ కుమార్, డిఇఒ లింగేశ్వర్ రెడ్డి, అభ్యర్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



అభ్యర్థులనుద్దేశించి మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలోని పలు విద్యాసంస్థలు ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ యథేచ్ఛగా తరగతులు నిర్వహిస్తున్నాయని, వెంటనే వీటిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎల్‌బిజి భవనం లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు డి. రాముతో కలిసి మాట్లాడారు. ఒక పక్క ఎండలు మండిపోతుంటే విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒంటి పూట బడులు నిర్వహించకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఇంటర్ విద్యార్థులకు అనధికారకంగా తరగతులు నిర్వహిస్తున్నారని, వీటిపై అర్ఐఒకు తెలిపినా మెతక వైఖరితో వ్యవహరిస్తున్నారని అన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురి చేయడంతో ప్రతి ఏటా రాష్ట్ర వ్యాప్తంగా పదుల సంఖ్యలోవిద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలలను ఇటువంటి కళాశాలల్లో చేర్పించకుండా కాపాడుకోవాలని కోరారు. ప్రభుత్వం తగు చర్యలు తీసుకొని యెడల భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. జిల్లా సహాయ కార్యదర్శి సిహెచ్ రామకృష్ణ, దీవెన పాల్గొన్నారు

ఫుడ్ కమిషన్ సభ్యులు కాంతారావు పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం

ఫుడ్ కమిషన్ సభ్యులు కాంతారావు బుధవారం కలెక్టరేట్ వద్ద ఉన్న కనపాక అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. గుడ్లు సరఫరా లో తేడా వచ్చాయని అంగన్వాడీ కార్యకర్తకు మెమో జారీ చేయాలని సిడిపిఒకు ఆదేశించారు. కంటోన్మెంట్ లో ఉన్న నగరపాలక ఉన్నత పాఠశాల సందర్శించి మధ్యాహ్న భోజనం సంబంధించి వంట గదిలో ఉన్న స్టాకును పరిశీలించారు. ఆయన వెంట డిఎస్ఒ మధుసూదనరావు, సిడిపిఒ ప్రసన్న, సూపర్‌వైజర్లు, సిఎస్‌డిటి శ్రీనివాస రావు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు యోధుడు మాకినేని

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కమ్యూనిస్టు యోధుడు మాకినేని బసవ పున్నయ్య అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రెడ్డి శంకర్రావు అన్నారు. బసవ పున్నయ్య వర్ధంతి సందర్భంగా బుధవారం ఎల్‌బిజి భవనంలో యాయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. రాజ్యసభ సభ్యుడిగా, కమ్యూనిస్టు నేతగా, తెలంగాణ సాయుధ పోరాట యోధుడిగా ,ఆయన పీడితప్రజల కోసం తనజీవితాన్ని అంకితం చేశాడని అన్నారు. తన జీవితాతం పేదలు,కష్ట జీవులు అభ్యున్నతి కోసం పోరు నడిపిన కమ్యూనిస్టు యోధుడని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టివి రమణ, నాయకులు పి.రమణమ్మ, వి.లక్ష్మి,వెంకటేష్, బి.రమణ కార్యకర్తలు పాల్గొన్నారు.



బసపున్నయ్యచిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

నేడు విద్యాశాఖా మంత్రి బొత్స జిల్లాకు రాక

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ గురువారం జిల్లాకు వస్తున్నారు. విద్యా శాఖ మంత్రి గురువారం సాయంత్రం 8 గంటలకు నగరానికి చేరుకుంటారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు నగరంలోని బాలాజీ జంక్షన్ వద్ద డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులు అర్పిస్తారు. 11 గంటలకు గుర్ల మండలం పల్లి గండ్రేడు లో గ్రామ సచివాలయం భవనాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 4 గంటలకు మెరకముడిదాం మండలం గుంటపల్లి లో గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వెల్ నెస్ కేంద్రం భవనాలను ప్రారంభిస్తారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర ప్రజలకు సంపూర్ణ మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి వెల్లడించారు. బుధవారం 32వ డివిజన్ లోని తోటపాలెం మౌర్య రెసిడెన్సీ గార్డెన్స్ స్థానికులతో కలిసి పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలను అపార్టుమెంట్ వాసులు డిప్యూటీ స్పీకర్ దృష్టికి తీసుకుని వచ్చారు. స్పందించిన ఆయన అక్కడున్న సిబ్బందికి సమస్యల పరిష్కారానికి తగు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా వీధి దీపాలను తక్షణమే ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులు ఆదేశించారు. రహదారి సౌకర్యాన్ని కల్పించాలని, ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలని ప్రజారోగ్యధికారి డాక్టర్ సత్యనారాయణకు ఆదేశించారు. అనంతరం అపార్ట్మెంట్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన స్థానికులను ఉద్దేశించి మాట్లాడారు. సకాలంలో పన్నులు చెల్లించే కాలనీవాసులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించే బాధ్యత పాలక పక్షాల పైన ఉంటుందని అన్నారు. పనిచేసే వారికి, నిత్యం అందుబాటులో ఉన్న వారినే ప్రజలు గెలిపించాలని కోరారు. సమావేశంలో వైసిపి నాయకులు ఎంఎస్ఎన్ రాజు, భోగాపురపు రవిచంద్ర, మారెం బాల బ్రహ్మారెడ్డి, రెడ్డి గురుమూర్తి, బొద్దాన అప్పారావు, మౌర్య గార్డెన్ అధ్యక్షులు వి.వి.ప్రసాద్, కార్యదర్శి మోహన్ రావు, నగరపాలక సంస్థ డిఇ అప్పారావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

అభివృద్ధి పనులు ప్రారంభం

నగరంలోని 43వ డివిజన్లో రూ.26.05 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రారంభోత్సవాలు చేశారు. పాల్ నగర్ ప్రాంతంలో రహదారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్‌ఛార్జి డాక్టర్ వి.ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం నగరంలో జరుగుతున్న అభివృద్ధి గతంలో ఎన్నడూ చూడలేదని అన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ దాసరి సత్యవతి, డివిజన్ నాయకులు వంతరం సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మలిచర్ల దుర్గారావు మృతి

ప్రజాశక్తి-విజయనగరం

రజక సంఘం జిల్లా అధ్యక్షులు మలిచర్ల దుర్గారావు గుండె పోటుతో బుధవారం ఉదయం మృతి చెందారు. నగరంలోని ప్రశాంతి నగర్‌లో నివాసం ఉంటున్న దుర్గారావు జిల్లాలోని రజకుల సమస్యలపై సుదీర్ఘకాలం పని చేశారు. కొద్దిరోజులుగా ఆయన అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. చిన్నకుమార్తెకు ఈనెలలో వివాహం జరగాల్సి ఉంది. దుర్గారావు మృత దేహాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు, వి.లక్ష్మి, సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.అప్పలసూరి జగన్మోహన్, ఆనంద్, ఐద్వా నాయకులు పి.రమణమ్మ సందర్శించి నివాళులర్పించారు.

సుజల స్రవంతి డిజైన్ మార్పు చేయాలి

ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్‌ను కలిసిన రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-వేపాడ

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కాలువ డిజైన్ మార్పు చేయాలని కోరుతూ ఎపి రైతు సంఘం నాయకులు బుధవారం రాజమండ్రిలో పోలవరం ఎడమ కాలువ చీఫ్ ఇంజినీర్ ఏసుబాబును కలిసి సమస్యను వివరించారు. కొద్దిరోజుల క్రితం నీటిపారుదలశాఖా మంత్రి అంబటి రాంబాబును కలిసి రైతు సంఘం నాయకులు సమస్యను వివరించగా ఇరిగేషన్ అధికారులను కలవాలని ఆయన సూచించారు. ఈనేపథ్యంలో ఎస్ఇని కలిసి కాలువ డిజైన్ మార్పు గురించి వివరించారు. స్పందించిన ఆయన సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులకు సూచిస్తానని తెలిపారు. అధికారులను కలిసిన వారిలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, సుజల స్రవంతి పోరాట కమిటీ గౌరవాధ్యక్షులు బోధంకి గౌరినాయుడు, పోరాట కమిటీ కన్వీనర్ చల్లా జగన్ తదితరులు ఉన్నారు.



సిఇకి వినతి పత్రాన్ని అందిస్తున్న రైతు సంఘం నాయకులు

అనాథకు అంత్యక్రియలు

రేగిడి : మండలంలోని వావిలవలస గ్రామానికి చెందిన అనాథ గండి అసిరప్ప అనారోగ్యంతో బుధవారం మృతి చెందడంతో అదే గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త, రాహుల్ సౌరబ్, నిత్య అన్నదాన నిర్వాహకులు పాలూరి సిద్ధార్థ సొంత ఖర్చుతో అంత్యక్రియలు నిర్వహించారు. అసిరప్పకు భర్త, పిల్లలు, ఎవరు లేకపోవడంతో దగ్గరుండి అంత్యక్రియలు ఏర్పాట్లు చేశారు. అసిరప్ప క్రిస్టియన్ కావడంతో వారి ఆచారాలతో అంత్యక్రియలు చేశారు. ఈ అంత్యక్రియల్లో చంటి, ప్రసాద్, సతీష్, లచ్చయ్య రవి, రామకృష్ణ ప్రేమ, కరుణ తదితరులు ఉన్నారు.

విజయపథం ప్రచార రథం ప్రారంభం

బొబ్బిలి : 2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల ప్రచారం కోసం టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబీనాయన విజయపథం ప్రచార రథాన్ని బుధవారం ప్రారంభించారు. శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో ప్రచార రథానికి పూజలు చేసి ప్రారంభించారు. పట్టణంలో ప్రచార రథాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా బేబీనాయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం ఖాయమన్నారు. వైసిపి పాలనపై ప్రజలు విసుగు చెందుతున్నారన్నారు. వైసిపికి బుద్ధి చెప్పి టిడిపిని గెలిపించడం ఖాయమన్నారు. అనంతరం శ్రీఆదిశక్తి ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో టిడిపి కౌన్సిలర్లు, నాయకులు, పాల్గొన్నారు.

34 మందికి కంటి పరీక్షలు

లక్కవరపుకోట : మండలంలోని రెల్లిగెడ్డపేటలో బుధవారం నిర్వహించిన అవ్వ – తాత కంటి వెలుగు కార్యక్రమంలో 60 ఏళ్ల పైబడిన 34 మందికి కంటి తనిఖీలు నిర్వహించారు. ఆప్తాలిక్ అధికారి సిహెచ్ ఈశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 12 మందికి కంటి శుక్ల చికిత్స, మరో 22 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త కెవిఎస్ఎస్ ఆర్ రాజు, ఎఎన్ఎం మణి, ఎంఎల్ హెచ్‌పి గౌరీ, ఆశా కార్యకర్తలు లక్ష్మీ, హేమ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విలేకర్ల హవా..!

లక్కవరపుకోట : మండలంలో రోజురోజుకు నకిలీ విలేకర్ల హవా పెరిగిపోతోంది. కొంతమంది విలేకరులమని చెప్పుకుంటూ దందా సాగిస్తున్నారు. ద్విచక్ర వాహనాలపై ప్రెస్ అని పేరు రాసుకొని చక్కర్లు కొడుతున్నారు. అమాయక ప్రజలను గుర్తించి తగాదాలు నెలకొల్పి సెటిల్మెంట్ పేరిట డబ్బులు గుంజుతున్నారు. ఈ తరహా దందాలకు పాల్పడుతున్న నకిలీ విలేకర్ల వల్ల నిజాయితీగా వివిధ పత్రికలలో పనిచేస్తున్న విలేకరులు ఇబ్బందులు పడుతున్నారు. విలేకరులమంటూ చెప్పుకొని తిరుగుతున్న వారిపై పోలీస్, రెవెన్యూ అధికారులు దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు. వారు పనిచేస్తున్న పత్రిక, ఛానల్ యాజమాన్యాలు మంజూరు చేసిన ఐడి కార్డులు, ప్రభుత్వం మంజూరు చేసిన అక్రిడిటేషన్ కార్డులను తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు

వేపాడ : మండలంలోని బొకెటిపాలెం, ఆర్ఎస్ పేట గ్రామాల్లో బుధవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని వైసిపి నాయకులు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ ఇంచార్జి బోజంకి శ్రీను, వాలంటీర్లు, సచివాలయ గృహసారథులు, కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి : ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వైసిపి ఎంపిపి రమేష్ అన్నారు. బుధవారం మండలంలోని రేజేరు గ్రామంలో మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఇంటింటికి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్ అంటించి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు గురించి వివరించారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌ను మరొకసారి గెలిపించాలని ప్రజలను కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నెల్లిమర్ల : నగర పంచాయతీ పారిశుధ్య కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిఐటియు గౌరవ అధ్యక్షులు టివి రమణ డిమాండ్ చేశారు. బుధవారం పారి శుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నగర పంచాయతీ కమిషనర్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టివి రమణ మాట్లాడుతూ ఈ విషయంపై పలు మార్లు విన్నవించుకున్నా పట్టించుకోక పోవడం దారుణమన్నారు. కార్మికులకు జనవరి, మార్చి నెల జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సంవత్సరానికి 15రోజుల క్యాజ్ వల్ లీవ్ రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్నారని ఇక్కడ కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పుష్ కార్టులు, డస్ట్ బిన్‌లు ఇప్పించాలని మాస్కులు, చేతి తొడుగులు, చెప్పులు, సబ్బులు గత మూడు సంవత్సరాలుగా ఇవ్వలేదని వెంటనే ఇవ్వాలని కోరారు. డంపింగ్ యార్డ్‌లో పని ఎక్కువగా ఉన్నప్పుడు జెసిబితో పని చేయించాలని, చనిపోయిన, రిటైర్ట్ అయిన కార్మికుల కుటుంబాలలో ఒకరికి ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టి. బాబూ రావు, ఎం. దుర్గా రావు, జె.శ్రీనివాస్, బి. బాబూ రావు, టి శశి రేఖ, జి. లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ

నెల్లిమర్ల : రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో నెల్లిమర్ల క్రీడాకారులు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారు. బుధవారం కుస్తీ కోచ్ వద్దాది వెంకట కుమార్ క్రీడా వివరాలను వెల్లడించారు. ఈ నెల 8,9, తేదీల్లో చిత్తూరు జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో నెల్లిమర్లకు చెందిన సిగడాపు శరత్ కుమార్ 74 కిలోల విభాగంలో రజిత పతకం, మిడిమల సునీల్ కుమార్ 65కిలోల విభాగంలో కాంస్య పతకం సాధించారు. వీరికి సిగడాపు ఆదినారాయణ ఆర్థిక సహాయం అందజేశారు. కుస్తీకి సౌకర్యాలు కల్పిస్తే మెరికల్లాంటి కుస్తీ క్రీడాకారులను తయారు చేస్తానని కోచ్ వద్దాది వెంకట కుమార్ తెలిపారు.

బాల్య వివాహాలతో నష్టం

శృంగవరపుకోట : బాల్య వివాహల వల్ల వ్యక్తిగత, సామాజిక అభివృద్ధి క్షీణించి నష్ట పోతామని ఎంఇఒ పి సత్యనారాయణ అన్నారు. బాలల హక్కులు బాల్య వివాహల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని సిడిపిఒ పి.ఉమ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ మండలం, గ్రామంలో సఖి సహేలీ కార్యక్రమం పక్కాగా నిర్వహించడం వల్ల ప్రస్తుత మనకు వివాహాల విషయం తెలుస్తుందన్నారు. బాల్య వివాహాల వల్ల ఆడపిల్లల ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపిడిఒ శేషుబాబు మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల ఆర్థికంగా కూడా నష్టపోతాయన్నారు. పెళ్లిని ఆపి వారిని ఆర్థికంగా నష్టపరిచే కన్నా ముందుగానే కౌన్సెలింగ్ నిర్వహించి బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కళాశాల స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

పూసపాటిరేగ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన స్థలాన్ని కొంతమంది వ్యక్తులు ఆక్రమణకు పాల్పడుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తమరాపు నగేష్ కుమార్‌తో పాటు స్థానిక సర్పంచ్ బొంపెల్ల సీతారాం బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నిమిత్తం 1984లో 10 ఎకరాల రెండు సెంట్లు భూమిని తిరుమలరాజు అప్పల వెంకటరామరాజు భూదాన పట్టాగా అగ్రిమెంట్ చేశారన్నారు. ఇప్పుడు ఆ భూమిని తిరిగి స్వాధీన పరచుకునేందుకు ఆ స్థలంలో ఆయన కుటుంబీకులు ఫెన్సింగ్ వేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై ఇప్పటికే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. పోలీసులు కూడా స్పందించి ఆ స్థలాన్ని ఆక్రమణకు పాల్పడుతున్న వారి పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు.

జాతీయ సైన్స్ ఒలింపియాడ్‌లో ప్రతిభ

శృంగవరపుకోట : గతేడాది డిసెంబర్‌లో జరిగిన జాతీయ ఒలింపియాడ్ సైన్స్ గణిత పరీక్షల్లో మండలంలోని వెంకటరమణపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాల సైన్సు ఉపాధ్యాయుడు సుధా ప్రసాదరావు మాట్లాడుతూ ఈ పరీక్షల్లో గనే పద్మసాయి, యందపల్లి భవ్యశ్రీ, కేదారి జంగారు లక్ష్మీ, సంధ్య, పిల్ల నాగేంద్ర, పల్లి మోహన్, దువ్వాడ మౌలిక సత్యా చాటి ప్రశంస పత్రాలు, మెడల్స్ సాధించారన్నారు. దీంతో రెండవ స్థాయి పరీక్షలకు అర్హత సాధించారని అన్నారు. వీరిని గణిత ఒలింపియాడ్ ఇన్చార్జ్ సూర రత్నం, ప్రధానోపాధ్యాయుడు ఎంకినాయుడు తదితరులు అభినందించారు.

19న సర్వసభ్య సమావేశం

లక్కవరపుకోట : మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 19న నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ జ్యోతీశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపిపి గేదెల శ్రీనివాసరావు అధ్యక్షతన జరగనున్న సర్వసభ్య సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచులు అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం

శృంగవరపుకోట : మండలంలోని ముసిడిపల్లి గ్రామ కూడలి వద్ద ముసిడిపల్లి సచివాలయ సిబ్బంది ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలిరోజు ఉచిత మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుకబొంగు దారప్ప తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లలో విఫలం

- ఉపకరణాలు గుర్తింపు శిబిరంలో వికలాంగులకు అవస్థలు
- కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు
- అధికారుల తీరుపై ఆగ్రహం

ప్రజాశక్తి- బొబ్బిలి

విభిన్న ప్రతిభావంతుల ఉపకరణాలు గుర్తింపు శిబిరం నిర్వహణకు ఏర్పాట్లు చేయడంలో అధికారులు విఫలమయ్యారు. ఉపకరణాలు గుర్తింపు కోసం కౌంటర్లు ఏర్పాటు చేసినప్పటికీ కౌంటర్లు వద్ద సమాచార బోర్డులు ఏర్పాటు చేయలేదు. క్యూ లైన్ కోసం ఏర్పాటు చేయకపోవడంతో వికలాంగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వికలాంగులకు సహాయకులుగా వచ్చిన వారు కూడా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శిబిరానికి వికలాంగులు వస్తారని తెలిసినప్పటికీ ఏర్పాట్లలో ఎలా విఫలమవుతారని వికలాంగులు, వారి సహాయకులు ప్రశ్నించారు.



తోపులాటకు దిగిన వికలాంగులు

ఉపకరణాలు గుర్తింపు శిబిరం వద్ద ఎటువంటి క్యూ పాటించేలా అధికారులు చర్యలు తీసుకోలేదు. దీంతో క్యూ పాటించకపోవడంతో వికలాంగులు తోపులాటకు దిగారు. కౌంటర్లు వద్ద తోపులాట జరగడంతో కొంతమంది వికలాంగులు కింద పడిపోయారు. కొంతమంది వికలాంగులకు ఎటువంటి సహాయం లేకపోవడంతో నిస్సహాయ స్థితిలో కింద కూర్చుని ఉండిపోయారు. అధికారుల తీరుపై వికలాంగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎవరూ పట్టించుకోలేదు


క్యూలో లైన్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న వికలాంగులు

ఉపకరణాలు గుర్తింపు శిబిరానికి రావాలని అధికారులే చెప్పినా ఇక్కడికి వచ్చిన తరువాత అధికారులు పట్టించుకోలేదని సంఘ వీధికి చెందిన వికలాంగుడు సిహెచ్ సురేష్ వాపోయాడు. అధికారులు పట్టించుకోకపోవడంతో మూడు గంటలు ఒకేచోట నిలబడి ఉన్నానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

సమాచారం ఇచ్చిన వారు లేరు

ఉపకరణాలు గుర్తింపు శిబిరానికి వచ్చిన వికలాంగులకు ఇక్కడ సమాచారం ఇచ్చిన నాథుడే లేరని వైసిపి కార్యకర్త రంగుముద్రి గోవింద్ ఆవేదన వ్యక్తం చేశారు. శిబిరానికి వికలాంగులు వస్తారని తెలిసి ఎందుకు సమాచారం ఇచ్చేందుకు వాలంటీర్లను, అధికారులను నియమించలేదని ప్రశ్నించారు. శిబిరానికి వచ్చిన వికలాంగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు.


ఎంపిక పత్రాన్ని అందిసున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు

వికలాంగుల సంక్షేమానికి ప్రాధాన్యత

వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. శ్రీకళాభారతి ఆడిటోరియంలో బుధవారం విభిన్న ప్రతిభావంతుల ఉపకరణాలు గుర్తింపు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులు మనస్థైర్యంతో ముందుకు వెళ్లాలన్నారు. వికలాంగులను గౌరవించి ఆదుకోవాలని కోరారు. వారికి అవసరమయ్యే ఉపకరణాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా అందజేస్తాయని చెప్పారు. అనంతరం వికలాంగులకు మూడు చక్రాల వాహనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు మురళి, జెడ్పిటిసి ఎస్.శాంతికుమారి, వికలాంగ సంక్షేమ అధికారులు, నాలుగు మండలాల ఎంపిడిఒలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లకు త్వరలోనే బిల్లులు

ప్రజాశక్తి - జామి

అభివృద్ధి పనుల్లో ఎంతో కీలకమైన కాంట్రాక్టర్లకు త్వరలోనే బకాయిలు బిల్లులు విడుదల చేయడానికి ముఖ్య మంత్రి చొరవ తీసుకుంటున్నారని, అందరికీ అతి త్వరలో బిల్లులు పడతాయని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వ సభ్య సమావేశానికి ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజుతో కలసి ముఖ్య అతిదిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తాను గడప గడప కార్యక్రమానికి వెళ్ళినప్పుడు బిల్లులు బకాయిలు పై అత్యధిక మంది అడుగుతున్నారని అన్నారు. దీనిపై ఇటీవల ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి స్పందించి, బిల్లులు విడుదలపై దృష్టి పెట్టినట్లు చెప్పారన్నారు. మరో 15రోజుల్లో బిల్లులు విడుదల అయ్యే అవకాశాలు ఉన్నాయని, కార్యకర్తలు సర్పంచ్ లు ఆందోళన చెందవద్దని చెప్పుకొచ్చారు. అనంతరం మండల హౌసింగ్ ఇల్లు మంజూరు, వాటి వివరాలపై ఆరా తీశారు. ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు మాట్లాడుతూ, రైతులు వాణిజ్య పంటల వైపు మరలాల్సిన అవసరం ఉందని, ఆదిశగా అవగాహన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి ఎంపిపి ఎస్.అరుణ అధ్యక్షత వహించగా, జెడ్పిటిసి జి.సరయు, వైస్ ఎంపిపిలు జి.వెంకటరావు, విజయలక్ష్మి, తహశీల్దార్ హేమంత్ కుమార్, ఎంపిడిఒ సతీష్, ఎంపిటిసిలు, సర్పంచులు, మండల శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

జామిలో హౌసింగ్ అక్రమాలు అరికట్టాలి

జామి గ్రామంలో జరుగుతున్న ప్రభుత్వ గృహనిర్మాణ పథకంలో భారీ అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని జామి ఎంపిటిసి-2 వి.వరలక్ష్మి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపిడిఒ సతీష్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. హౌసింగ్ సిబ్బంది, సచివాలయం సిబ్బంది కలిసి ప్రభుత్వ ఆశయాలకు విరుద్ధంగా అవినీతికి పాల్పడుతున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గృహ నిర్మాణ బిల్లులకు లబ్ధిదారుల నుంచి అక్రమ వసూలుకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అడిగిన డబ్బులు ఇవ్వకుంటే, లేనిపోని శాకులతో పథకం ఆపేసి, అర్హులకు అన్యాయం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే కలెక్టర్ గ్రివెన్సుకు వెళ్లి ఫిర్యాదు చేసిన సందర్భాలు గుర్తు చేశారు. కాబట్టి ఇప్పటికైనా గ్రామంలోని గృహ నిర్మాణ పనులపై సమగ్ర విచారణ చేసి, అక్రమాలు అరికట్టి, ప్రభుత్వ ప్రతిష్ట ను కాపాడాలని కోరారు.

పంచాయతీ దుకాణాల అద్దె పెంపు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలో పంచాయతీకి చెందిన దుకాణాల అద్దెని పెంచాలంటూ పంచాయతీ పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. బుధవారం మధ్యాహ్నం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సంతోషికుమారి నేతృత్వంలో పంచాయతీ పాలకవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్వీపర్ల రోజువారీ వేతనాలు టెండర్ గతం కన్నా తక్కువ ఎలా ఆమోదించారని వార్డు సభ్యులు వాసు, శేషగిరి, చెల్లయ్యలు అభ్యంతరం వ్యక్తం చేశారు. షాపుల అద్దెలు పెంపు పై చర్చలో తొమ్మిదేళ్లుగా పాత దుకాణాలను కూల్చి నూతనంగా నిర్మాణం చేస్తామని చెప్పి వదిలేయటంతో అద్దెలు రాకుండా పోతున్నాయని, 50శాతం అద్దెలు పెంచుదామన్న నిర్ణయాన్ని అమోదించారు. శానిటేషన్‌లో పంచాయితీ పరమ ఘోరంగా ఉందని, అనుమతులు లేకుండా భవనాలు నిర్మిస్తే చర్యలు ఎందుకు లేవని, కన్నెంగెడ్డలో ఆక్రమణలు ఎందుకు పట్టించుకోరు అంటూ శేషగిరి, చెల్లయ్య, వాసు, ఎస్.రామకృష్ణలు అడిగారు. రాంనగర్‌లో వీధి కుళాయిలు వేయలేదని గనివాడ శ్రీను, పుణ్య గిరి వద్ద గల క్రీడా మైదానంలో వీధి దీపాలు లేవని శేషగిరి అడిగారు. పలువురు వార్డు సభ్యులు శృంగవరపుకోట దేవి బొమ్మ జంక్షన్ వద్ద జరుగుతున్న డైలీ మార్కెట్ వల్ల ట్రాఫిక్ తీవ్ర అంతరాయం కలిగి ఇబ్బందులు వస్తున్నాయన్నారు. దీనిని అక్కడ నుంచి ప్రకాశం మార్కెట్లోకి మార్పించాలని కోరారు. ఈ విషయంపై సర్పంచ్ సంతోష్ కుమారి, ఉప సర్పంచ్ మోపాడు కుమార్ మాట్లాడుతూ ప్రకాశం మార్కెట్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఇవి పూర్తికాగానే అక్కడి నుంచి మార్కెట్ ఈ ప్రదేశంలో నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. మరి కొంతమంది వార్డు సభ్యులు మాట్లాడుతూ పట్టణంలో చాలామంది అనుమతులు లేకుండా సెకండ్ ఫ్లోర్, థర్డ్ ఫ్లోర్, ఇంకా పై అంతస్తులు వేస్తున్నారని వీటికి పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతులూ లేకపోయినా ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ఈ విషయంపై ఈవో పాత్ర మాట్లాడుతూ అటువంటి వాటిని గుర్తించి నోటీసులు అందజేస్తామని తెలిపారు. ఈ సమావేవంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాలకవర్గ సమావేశంలో నిర్ణయం

ఘనంగా అవంతి వార్షికోత్సవం



మాట్లాడుతున్న విసి నిమ్మ వెంకటరావు

ప్రజాశక్తి- గరివిడి

స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో 22వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.జాషువ జయప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎచ్చెర్ల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ విసి ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. సమాజంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులను ప్రభావితం చేస్తారన్నారు. విద్యార్థులు సమాజాన్ని ప్రభావితం చేస్తారని తెలిపారు. విద్యార్థులు ఉద్యోగం కోసమే కాకుండా ఉపాధి అవకాశాలు పెంపొందించే స్థాయికి ఎదగాలన్నారు. ఉపాధ్యాయులు కూడా బోధన కోసమే కాకుండా విద్యార్థులను సామాజిక పురోగతి కోసం తోడ్పడేటట్లు చేయాలని చెప్పారు. విశాఖపట్నం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ పి. శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాతకమైన మార్పులకు అనుగుణంగా, అధునాతన పద్ధతులు ఉపయోగించి కొత్త ఆలోచనలు, కొత్త ఆవిష్కరణలతో సాంకేతిక విద్యను అభ్యసించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ టి.వంశీ మోహన్, అవంతి విద్యా సంస్థల జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎమ్.లక్ష్మీ ప్రియాంక, అనంరం వివిధ విభాగల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, ప్రశంసా పత్రాలు, ఆటల పోటీల్లో విజేతలకు అతిథులు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఇందులో భాగంగా విద్యార్థినులు చేసిన నృత్యాలు పలువుర్ని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఏవో జి.అనిల్ కుమార్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సూచనలు చేస్తున్న రఘుపాత్రుని భీమారావు

ఎంవిజిఆర్‌లో కెమ్‌వెర్స్ సింపోజియం

డెంకాడ : చింతలవలస ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులు పాటు జరగనున్న కెమ్‌వెర్స్ 2023 నేషనల్ టెక్నికల్ స్టూడెంట్స్ సింపోజియం బుధవారం ప్రారంభమైంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్, ఎంవిజిఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ఈ సందర్భంగా సిఎస్ఐఆర్ మాజీ చీఫ్ సైంటిస్టు డాక్టర్ రఘుపాత్రుని భీమారావు పాల్గొని కెమికల్ ఇంజనీరింగ్ ప్రాధాన్యత గురించి తెలియజేశారు. పర్యావరణ సమతుల్యత, ఇంధన వనరుల పొదుపు, నీటి వనరుల పొదుపు తదితర సహజ వనరుల సద్వినియోగం ప్రకృతిని కాపాడటంలో అధ్యయనం చేస్తూ కొత్త కొత్త శాస్త్ర, సాంకేతిక పద్ధతులను అభివృద్ధి చేస్తూ పర్యావరణ పరిరక్షణకు కెమికల్ ఇంజినీర్లు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైఎంసి శేఖర్, ప్రొఫెసర్ బి. సర్వారావు, కెమికల్ ఇంజనీరింగ్ స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

శిలాఫలకాలు ధ్వంసం

జామి : టిడిపి హయాంలో మండలంలోని కిర్ల పంచాయితీలో ఏర్పాటు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను అగంతకులు ధ్వంసం చేసిన ఉదంతం పై టిడిపి వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కిర్ల మెరక గ్రామానికి వెళ్లే రోడ్డును మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి చొరవతో రూ.50 లక్షలతో నిర్మించారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి నియోజకవర్గంలో పర్యటిస్తూ, తాము చేసిన పలు అభివృద్ధి పనులను ప్రజలకు గుర్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అధికార పార్టీకి చెందిన గుర్తు తెలియని వ్యక్తులు అప్పటి శిలాఫలకాలను పగలగొట్టారని టిడిపి నాయకులు యర్రంశెట్టి కృష్ణ ఆరోపిస్తున్నారు. టిడిపి అభివృద్ధి పనులు కనిపించకుండా చేయడానికే దుర్మార్గానికి పాల్పడ్డారని విమర్శించారు. అభివృద్ధి పనులు చేయడం చేతకాని వాళ్లే ఇలా శిలా ఫలకాలను ధ్వంసం చేస్తారని మండిపడ్డారు. చేతనైతే అభివృద్ధి చేసి చూపాలని, అంతేకానీ ఇలా సైకో ఆనందం పొందడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు.

'జగన్‌ను మళ్లీ ఆశీర్వదించండి'

భోగాపురం : జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు చూసి మరోసారి ఆశీర్వదించాలని వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలకు అన్ని విధాల సంక్షేమ పథకాలూ అందించి, ప్రభుత్వం ఆదుకుందన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసిపి 175 స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం ప్రజల కోసం పనిచేసే నాయకులకు ఎల్లవేళలా గుర్తింపు ఉంటుందని అన్నారు. ఎమ్మెల్యే బడుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ భోగాపురం అభివృద్ధికి రూ.26 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ జిల్లా పరిషత్ చైర్మన్ మధ్య శ్రీనివాసరావు ఎంపిపి ఉప్పాడ అనుష, మండల కన్వీనర్ సూర్యనారాయణ, వైసిపి సిఇసి సభ్యులు కాకర్లపూడి శ్రీనివాసరాజు, జిల్లా కోశాధికారి కందుల రఘుబాబు, డెంకాడ, నెల్లిమర్ల ఎంపిపిలు వాసుదేవరావు, అంబళ్ల సుధారాణి, జెడ్పిటిసిలు, పడాల మంజులత, బడ్డుకొండ లక్ష్మి, గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపిపిలు, సర్పంచులు, తదతరులు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న వైవి సుబ్బారెడ్డి

రైతులకు శిక్షణ

శృంగవరపుకోట : సమగ్ర వ్యవసాయ పద్ధతులు పాటించడం వల్ల రైతులు అధిక ఆదాయాన్ని పొందవచ్చునని బెంగళూరుకు చెందిన వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ఎన్ సుశీల్ అన్నారు. బొడ్డవర రైతు భరోసా కేంద్రంలో గిరిజన కుటుంబాలకు సమగ్ర వ్యవసాయ పద్ధతులపై బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వ్యవసాయంలో వివిధ పంటలలో జీవ నియంత్రణ గురించి తెలిపారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ప్రస్తుత వ్యవసాయ పద్ధతులు, గిరిజన ప్రాంతాల్లో పంటల సరళలను తెలియపరిచారు. అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ పివికె జగన్నాథరావు విలువ ఆధారిత ఉత్పత్తులు గ్రామస్థాయిలోనే వ్యవసాయ ఉత్పత్తుల ప్రోసెసింగ్ గురించి తెలియజేశారు. విజయనగరం వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎన్ అనురాధ, డాక్టర్ ఎంఎంవి శ్రీనివాసరావు చిరుధాన్యాలు సమగ్ర వ్యవసాయ విధానాల గురించి వివరించారు. శిక్షణలో ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ కె లక్ష్మణ ఎఒ రవీంద్ర, శాస్త్రవేత్తలు డాక్టర్ తేజేశ్వరరావు, స్వాతి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మల్లంపేట విద్యార్థికి గోల్డ్ మెడల్

బొబ్బిలి : స్థానిక మున్సిపాలిటీలోని మల్లంపేట గ్రామానికి చెందిన పోలరుక్కు మన్మధరావు గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నాడు. మన్మధరావు అలహాబాద్ ఎంఎన్ నిట్ యూనివర్సిటీలో బి.టెక్ మెకానికల్ చదివాడు. ఫలితాల్లో టాపర్‌గా నిలిచి గోల్డ్ మెడల్ సాధించాడు. మన్మధరావును లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా అభినందించి గోల్డ్ మెడల్ అందజేశారు. మన్మధరావుకు గోల్డ్ మెడల్ రావడంతో తల్లిదండ్రులు చిన్నతల్లి, శ్రీనివాసరావు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గోల్డ్ మెడల్ సాధించడం ఎంతో సంతోషంగా ఉందని మన్మధరావు అన్నారు.

బెల్ట్ షాప్ పై దాడి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

అక్రమంగా మద్యం అమ్ముతున్న బెల్ట్ షాపు పై దాడి చేసి 22 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పి. నారాయణరావు తెలిపారు. చిన బూరాడ పేటలో బెల్ట్ షాపులో అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో దాడి ఒక వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు. అక్రమంగా మద్యం అమ్మకాలు జరిపితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - కొత్తవలస

పార్టీలకతీతంగా అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. కొత్తవలస-5 సచివాలయ పరిధిలో రాజపాతుని పాలెంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఇంటి ఇంటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వ పథకాలు అమలుపై అరా తీశారు. ప్రతీ గడపలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, పి ఏసిఎస్ చైర్మన్ గొరపల్లి శివ, జెసిఎస్ మండల ఇంచార్జీ బొంతుల వెంకటరావు, వైస్ ఎంపిపి కర్రి శ్రీనివాసరావు, కొత్తవలస సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, స్వామినాయుడు, అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్ లెంక లక్ష్మి, సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్యేక పారిశుధ్య పనులు

బొబ్బిలి : మల్లంపేట గ్రామదేవత పండుగ నేపథ్యంలో ప్రతిరోజు ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు కోరారు. మల్లంపేట, ఆర్‌టిసి కాంప్లెక్స్, రైల్వే ఫ్లైఓవర్ ప్రాంతాల్లో బుధవారం పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామదేవత పండు నేపథ్యంలో ప్రతిరోజు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని శానిటరీ ఇన్స్పెక్టర్ అనుపమను ఆదేశించారు. ఆయనతో మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పంచాయతీల బలోపేతానికి కృషి

నెల్లిమర్ల : గ్రామ పంచాయతీల బలోపేతానికి పంచాయతీ రాజ్ ఛాంబర్ ప్రతినిధులు, సభ్యులు కృషి చేయాలని మాజీ సిఎం చంద్రబాబునాయుడు దిశా నిర్ధేశం చేశారని పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి గేదెల రాజారావు తెలిపారు. బుధవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ విజయవాడలో జరిగిన ఏపి పంచాయతి రాజ్ ఛాంబర్ సభ్యులతో చంద్రబాబు సమావేశం నిర్వహించారని అన్నారు. గ్రామ పంచాయతీలు ఆర్థిక పరమైన ఇబ్బందులు పడుతున్నట్లు చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లినట్లు రాజారావు తెలిపారు. ఈ సమావేశంలో తనతో పాటు పూసపాటి పాలెం సర్పంచ్ రౌతు సోము నాయుడు పాల్గొన్నారన్నారు.


సమావేశంలో పాల్గొన్న పంచాయతీరాజ్ ఛాంబర్ ప్రతినిధులు

భీమాలి తాండ్రకు జిఐ ట్యాగ్ అవసరం

విజయనగరం టౌన్ : లక్కవరపు కోట మండలం భీమాలి మామిడి తాండ్రకు ప్రసిద్ధి అని, కానీ ఆశించిన స్థాయిలో దీనికి గుర్తింపు రాలేదని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ తేజస్వి కట్టిమని అన్నారు. తాండ్ర వ్యాపారానికి అవసరమైన వ్యాపార మెళకువలు, బ్రాండింగ్, నాణ్యత, స్టోరేజ్ సౌకర్యాలను పెంచినట్లయితే తాండ్రకు జియోగ్రాఫికల్ ఇండికేషన్ తీసుకురావచ్చని, తద్వారా మంచి లాభాలు పొందవచ్చునని తెలిపారు. బుధవారం సిటియులో ప్రాస్పెక్టస్ అండ్ ప్రొబ్లెమ్స్ అఫ్ మాంగో జెల్లీ బిజినెస్' అనే అంశంలో జరిగిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు భీమాలి తాండ్ర తయారీ, అమ్మకం ప్రాజెక్ట్ వర్క్ గా కూడా ఇస్తామని తెలిపారు. అనంతరం డిఆర్‌డిఎ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సావిత్రి, డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ జయశ్రీ, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ కళింగ వర్ధన్, అంబికా స్వీట్స్ సిఇఒ శ్రీనివాస్ భీమాలి సర్పంచ్ కృష్ణ, మామిడి తాండ్ర తయారీకి సంబందించిన సమస్యలు, వ్యాపారానికి సంబంధించి సూచనలు సలహాలను అందించారు. ఆచార్య జితేంద్ర మోహన్ మిశ్రా కన్వీనర్‌గా, డాక్టర్ ఎన్ వి ఎస్ సూర్యనారాయణ ఆర్గనైజింగ్ సెక్రటరీగా వ్యవహరించారు.